ఎమ్మెల్యే పద్మారావును కలిసిన నేతలు

సికింద్రాబాద్, జనవరి 4 : తెలంగాణ దళిత సిట్టింగ్ వెహికల్స్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్‌ను ప్రతినిధులు సికింద్రాబాద్, టకారాబస్తీలోని ఆయన నివాసానికి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తమ సమస్యలను పద్మారావుకు వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి రామచందర్, ప్రతినిధులు రవి, జి నాగేశ్, ఎస్.కిరణ్, జి.మల్లేశ్ పాల్గొన్నారు.

ఘనంగా సిల్వర్ జూబ్లీ వేడుకలు

బొల్లారం, జనవరి 4 : విద్యార్థి దశ నుంచే ఉన్నత ఆశయాలు అలవర్చుకొని, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సీఎంఆర్ విద్యాలయాల వ్యవస్థాపకుడు మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. శనివారం బోయిన్‌పల్లిలోని సీఎంఆర్ పాఠశాలలో 25 సంవత్సరాల సిల్వర్ జూబ్లీ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి, ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్, సీఎంఆర్ విద్యాలయాల అధినేత సీహెచ్.గోపాల్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. అనంతరం విద్యతో పాటు, క్రీడల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీఎంఆర్ విద్యాలయాల బోర్డు డైరెక్టర్లు, పాఠశాల డైరెక్టర్ ఎస్.కే.రెడ్డి, ప్రిన్సిపాల్ నాగేశ్వరి, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

సెయిలింగ్ పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు

బేగంపేట్, డిసెంబర్ 4 : హైదరాబాద్‌లోని తెలంగాణ సెయిలింగ్ చాంపియన్ షిప్‌లో ఇటీవల జరిగిన పోటీల్లో రాంగోపాల్‌పేట్ డివిజన్ ఓల్డ్ నల్లగుట్ట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులు తమ సత్తా చాటారు. నాల్గవ తరగతి చదువుతున్న అర్షిన్‌అహ్మద్ సబ్ జూనియర్ చాంపియన్ షిప్‌లో బాలికల విభాగంలో స్టేట్ చాంపియన్‌షిప్‌లో రెండో స్థానం దక్కించుకొని వెండి పతకాన్ని దక్కించుకున్నది. అలాగే 5వ తరగతి చదువుతున్న యువరాజ్‌గుప్తా స్టేట్ సబ్ జూనియర్ చాంపియన్‌షిప్‌లో రెండో స్థానాన్ని దక్కించుకొని వెండి పతకాన్ని గెలుచుకున్నాడు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 15 జిల్లాల నుంచి 131 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నట్టు నిర్వాహకులు సుహేశ్‌షేక్ తెలిపారు. అర్షిన్‌అహ్మద్, యువరాజ్‌గుప్తాలను శనివారం ప్రధానోపాధ్యాయుడు బత్తినిశౌరి అభినందించారు.

క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

బొల్లారం, జనవరి 4: యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్(యూబ్ల్యూహెచ్), గ్రేస్ క్యాన్సర్, ఫెర్నాండ్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం తిరుమలగిరి లాల్ బజార్ హోలీ ఫ్యామిలీ పాఠశాలలో క్యాన్సర్‌పై అవగాహన, స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డీసీపీ మధుకర్ స్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్‌లో భాగంగా మమోగ్రఫీ, పాప్స్మియర్ పరీక్షలు నిర్వహించి, క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు మహేశ్వరి, రవళి, జీవన్ పాల్గొన్నారు.

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

కాచిగూడ, జనవరి 4: పేకాట ఆడుతున్న 10 మందిపై కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ కె.చంద్రకుమార్, ఎస్సై పి.రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 10 మంది పేకాటరాయుళ్లు మహ్మద్ అర్షద్ అహ్మద్, సల్మాన్‌మాయిం, ముత్తూజా, నందీశ్, బేగ్, రిజ్వాన్, హకీం, హజీం, మిర్జా అహ్మద్, సయ్యద్ మోహినోద్దిన్ శుక్రవారం రాత్రి కాచిగూడలోని మహారాజ ఓయో హోటల్ గదిలో మూడు ముక్కలాట అడుతున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. కాచిగూడ పోలీసులు ఇంట్లో సోదాలు చేయగా రూ.46, 690 , 13 సెల్‌ఫోన్లు, 52 ప్లెయింగ్ కార్డులు దొరికాయి. వాటిని స్వాధీనం చేసుకొని శనివార ంవారిని అరెస్ట్ చేసి, హోటల్ యాజమాని రాజేశ్, మేనేజర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు. హోటల్ యాజమాని రాజేశ్ ఫరారీలో ఉన్నట్లు తెలిపారు.

'మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి'

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 4: మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి జరుగుతుందని తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారి, సీనియర్ జర్నలిస్టు వనజ అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని ఆంధ్ర మహిళా సభ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ ఫర్ ఉమెన్‌లో 'ఎంపవర్ ఏ ఉమెన్, ఎంపవర్ ఏ నేషన్: ద రిపుల్ ఎఫెక్ట్ ఆఫ్ ఎంపవర్‌మెంట్'పై అతిథి ఉపన్యాస కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి బాలాచారి, వనజ ముఖ్యవక్తలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ సేవలో సావిత్రీబాయి పూలే అందరికీ ఆదర్శంగా నిలిచారని అన్నారు. బాలికల విద్య కోసం ఆమె ఎంతో కృషి చేశారని కొనియాడారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలకు వ్యతిరేకంగా సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి రజిని, ప్రిన్సిపాల్ కె. ఝాన్సీరాణి, అకాడమిక్ కోఆర్డినేటర్ కరుణాదేవి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎ. ప్రమీల, ఉమెన్ సెల్ కన్వీనర్ హిమబిందు పాల్గొన్నారు.

సాహిత్య అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారిని సన్మానిస్తున్న నిర్వాహకులు

వడ్డెరుల సంక్షేమానికి కృషి చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షుడు వెంకటేశ్

చిక్కడపల్లి, జనవరి4 : వడ్డెరుల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేయాలని ప్రభుత్వాన్ని వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షుడు వేముల వెంకటేశ్ కోరారు. తెలంగాణ వడ్డెర సంఘం చారిటీ ట్రస్ట్ రాష్ట్ర వడ్డే ఓబన్న జయంతి సన్నాహక సమావేశం శనివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు ఐలుమల్లు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి వేముల వెంకటేశ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలని అన్నారు. ప్రమాదంలో చనిపోతే రూ.10లక్షల ఆర్థిక సాయం అందించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా 11న వడ్డే ఓబన్న జయంతిని రవీంద్ర భారతిలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు మల్లేశ్, నాయకులు గణేశ్, భిక్షం, దుర్గయ్య, శ్రీనివాస్, శంకర్, చెన్నయ్య, శ్రీను పాల్గొన్నారు.

మహిళల వాలీబాల్ జట్టు ఎంపిక

బన్సీలాల్‌పేట్, జనవరి 4 : కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ మహిళల వాలీబాల్ జట్టు ఎంపిక ప్రక్రియ గాంధీ వైద్య కళాశాలలో జరిగింది. ఈ నెల 7 నుంచి 11 వరకు చెన్నైలోనీ జేపీఆర్ యూనివర్సిటీలో జరుగనున్న సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌లో మహిళల వాలీబాల్ జట్టు పాల్గొననున్నది. ఈ జట్టు కోసం తెలంగాణాలోని గాంధీ, మమత, మల్లారెడ్డి వైద్య కళాశాలలు, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల సికింద్రాబాద్ నుంచి విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా గాంధీ మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే.రవిశేఖర్‌రావు, గాంధీ మెడికల్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎ.వేణు, వివిధ కళాశాలల నుంచి వచ్చిన సెలక్షన్ కమిటీ సభ్యులు, పీడీలు సందీప్‌కుమార్ జాదవ్ (ఉస్మానియా), బి.రమేశ్ (మమత కాలేజి), శివకుమార్ (మల్లారెడ్డి మెడికల్ కాలేజ్) ఎంపికైన జట్టు సభ్యులను అభినందించారు.

ఎమ్మెల్సీ కవితకు శుభాకాంక్షలు

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను బన్సీలాల్‌పేట్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు భరత్‌కుమార్, రంజిత్‌కుమార్, సాయిబాబా, చిన్నా, భాను తదితరులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

- బన్సీలాల్‌పేట్, జనవరి 4 :

శబరిమలకు తరలిన అయ్యప్పస్వాములు

ఇరుముడి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని

బేగంపేట్, జనవరి 4: శబరిమల యాత్ర అయ్యప్ప స్వామి దివ్య దర్శనం జన్మజన్మల ఫలం అని మాజీ మంత్రి సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శనివారం ఆదర్శనగర్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో తన కుమారుడు తలసాని సాయికిరణ్‌యాదవ్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాముల ఇరుముడి పూజలో తలసాని శ్రీనివాస్‌యాదవ్ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. పూజల అనంతరం అయ్యప్ప స్వాముల శబరిమల యాత్రను ఆయన ప్రారంభించారు.

తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులు పూర్తి చేయాలి

అధికారులతో కలిసి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి తదితరులు

సికింద్రాబాద్, జనవరి4: అడ్డగుట్ట డి సెక్షన్‌లో జరుగుతున్న తాగునీటి పైప్ లైన్ పనులను శనివారం కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... త్వరగా అభివృద్ధి పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆమె అధికారులను ఆదేశించారు. సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ సహకారంతో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఆమె తెలిపారు. ఆమెతో పాటు జలమండలి డీజీఎం విద్యాసాగర్, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్, సత్తయ్య గౌడ్, రామప్ప, రాజు ఉన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

చిక్కడపల్లి, జనవరి4 : ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. శంకర్ గురుస్వామి, జనార్దన్ స్వాముల ఆధ్వర్యంలో శనివారం బాగ్‌లింగంపల్లి శ్రీసాయిబాబా దేవాలయంలో నిర్వహించిన అయ్యప్ప పూజా కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఠాగోపాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అయ్యప్ప దీక్ష ఎంతో పవిత్రమైందన్నారు. కార్యక్రమంలో దేవాయలం కార్యదర్శి దర్మరాజ్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకుడు శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

లా కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 4: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ లా కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ, మూడేళ్ల ఎల్ఎల్‌బీ ఆనర్స్ ఐదో సెమిస్టర్ రెగ్యులర్, ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీబీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీకామ్ ఎల్ఎల్‌బీ తదితర కోర్సుల ఐదు, ఏడు, తొమ్మిదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును ఈ నెల 17వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 21వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania. ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలి

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 4: విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలని మొహాలీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసర్చ్ (నైపర్) ప్రొఫెసర్ పీవీ భరతం సూచించారు. ఉస్మానియా యూనివర్సిటీ కెమిస్ట్రీ విభాగంలో 'కెమికల్ బాండింగ్: ది సింథసిస్ ఆఫ్ కంపౌండ్స్ విత్ న్యూ కెమికల్ బాండింగ్' అనే అంశంపై అతిథి ఉపన్యాస కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. విభాగంలోని సెమినార్ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పీవీ భరతం హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన శాస్త్రంలో కొత్త రకాల బంధాల సృష్టి, వాటి ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో విభాగం హెడ్ ప్రొఫెసర్ మనోహర్, ఇతర అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ పీవీ భరతం

పనులు వేగంగా పూర్తి చేయాలి

చిక్కడపల్లి, జనవరి4 : గాంధీనగర్ డివిజన్ పరిధిలోని జవహర్‌నగర్ ఇటీవలపై మొదలైన సివరేజ్ పైప్‌లైన్ పనులు శనివారం డివిజన్ కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనులు వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ మేనేజనర్ కృష్ణమోహన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్, వినయ్‌కుమార్, రత్నసాయిచంద్ పాల్గొన్నారు.

శబరిమలకు తరలిన అయ్యప్ప స్వాములు

సికింద్రాబాద్,జనవరి 4 : అయ్యప్ప దీక్ష తో ఆధ్యాత్మికత తో పాటు ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని సికింద్రాబాద్ శాసనసభ్యులు టి. పద్మారావుగౌడ్ అన్నారు. అయ్యప్ప దీక్షలో ఉన్న తన కుమారులు, కుటుంబ సభ్యులు, అభిమానుల బృందం శనివారం మోండా మార్కెట్‌లో ఇరుముడులు ధరించి శబరిమల యాత్రకు తరలివెళ్లారు. రామేశ్వర్‌గౌడ్ నేతృత్వంలో ప్రత్యేక బస్సులో తరలిన వారికి పద్మారావుగౌడ్ ఘనంగా వీడ్కోలు పలికారు. యువ నేతలు కిషోర్‌కుమార్, త్రినేత్రగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సివిల్స్‌పై ఉచిత శిక్షణ

చిక్కడపల్లి,జనవరి4 : కమ్మ సామాజిక వర్గానికి చెందిన పేద విద్యార్థినులకు సివిల్స్, గ్రూప్-1 పోటీ పరీక్షల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నామని జనసేన సమితి ప్రతినిధి, పోటీ పరీక్షల నిపుణుడు లక్ష్మయ్య ఒక ప్రకటనతో తెలిపారు. లక్ష్మయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో ప్రవేశ పరీక్షను నిర్వహిస్తామని తెలిపారు. ప్రతిభ కబరిచిన అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైన వారికి ఏడాది పాటు ఆఫ్‌లైన్ రెండేళ్ల పాటు ఆన్‌లైన్ శిక్షణ ఇస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు 83309 34815 సంప్రదించాలని కోరారు.

గుండె పోటుతో జర్నలిస్టు భీంరావు మృతి

భీంరావు (ఫైల్)

చిక్కడపల్లి / ముషీరాబాద్, జనవరి4 : సీనియర్ జర్నలిస్టు ఎన్.సీ. బీంరావు(60) శనివారం తల్లవారుజామున గుండెపోటుతో మరణించారు. ముషీరాబాద్ కేంద్రంగా ఆయన వివిధ పత్రికల్లో దాదాపు మూడు దశాబ్దాల పాటు విలేకరిగా పనిచేశాడు. ఆయనకు భార్య, ఒక కొడుకు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. భీంరావు భౌతికకాయానికి మౌలాలిలోని శ్మశానవాటికలో అంత్యక్రియలు జరిగాయి.

భీంరావుకు పలువురు జర్నలిస్టుల సంతాపం

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్లూజేఎఫ్)రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య మౌలాలిలోని ఆయన ఇంటికి వెళ్లి భీంరావు భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. అదే విధంగా గ్రేటర్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు హెచ్.వీరారెడ్డి, కనకరాజు, సాగర్, రాంరెడ్డి, నాగరాజు, తెలంగాణ జన సమితి గ్రేటర్ అధ్యక్షుడు నర్సయ్య తదితరలు బీంరావు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

గవర్నర్ దత్తాత్రేయ సంతాపం

సీనియర్ జర్నలిస్టు భీంరావుయాదవ్ మృతిపై హరియనా గవర్నర్ బండారు దత్తాత్రేయ సంతాపాన్ని తెలియజేశారు. మూడు దశాబ్దాలుగా ఆయన పాత్రికేయ రంగంలో విశేష సేవ లందించారని అన్నారు.

న్యూస్ ప్రెజెంటర్స్ జీవన సాఫల్య పురస్కారం

ముషీరాబాద్, జనవరి 4: ఆరాధన సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో శనివారం టీవీ న్యూస్ ప్రెజెంటర్స్ -24 జీవన సాఫల్య పురస్కార ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి. శేషశయనారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని టీవీ న్యూస్ ప్రెజెంటర్స్ జీవన సాఫల్య పురస్కారాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో జస్టిస్ బూర్గుల మధుసూదన్, రాజశేఖర్‌రెడ్డి, హనుమంతరావు, లయన్ ఉమాఖాన్, యుగేందర్‌రెడ్డి, నిర్మలాప్రభాకర్, వెంకట్ రావు, ప్రతాప్‌కుమార్, రామరాజు శ్రీనివాస్, లక్ష్మీశ్రీనివాస్, రాఘవా రెడ్డి, కృష్ణయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో చదువాలి

కాచిగూడ : కొత్త ఆలోచనలతో దేశాభివృద్ధికి తోడ్పడాలని, లక్ష్యంతో చదువుకుంటే విజయాలు సాధించవచ్చని అసోసియేట్ డైరెక్టర్ అనుషా విజయ్‌కాంత్ అన్నారు. కాచిగూడ బద్రుక కళాశాల పీజీ (ఎంబీఏ) ఆధ్వర్యంలో స్ప్లాష్-2025 శనివారం రాత్రి ముగింపు వేడుకలు విద్యార్థులు సందడిగా నిర్వహించారు. ఫ్యాషన్ షో, డాన్స్ పోటీల్లో శాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా అనుషా విజయ్‌కాంత్ విచ్చేశారు. విద్యా రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా నైపుణ్యతను పెంపొందించుకోవాలని సూచించారు. ర్యాన్ ట్యాక్స్ ఇండియా ఎన్‌ట్రోల్డ్ డైరెక్టర్ జీతల్ టక్కర్, లక్ష్మీనివాస్‌శర్మ, కళాశాల కార్యదర్శి కిషన్ బద్రుక పాల్గొన్నారు.

లూయిస్ బ్రెయిలీకి ఘన నివాళి

ముషీరాబాద్, జనవరి 4: చిక్కడపల్లి త్యాగరాయగానసభలో శనివారం లూయిస్ బ్రెయిలీ సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో పిన్ననేని సాయిబాబా ముఖ్యఅతిథిగా హాజరై లూయిస్ బ్రెయిలీ చిత్ర పటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లూయిస్ ప్రత్యేక బ్రెయిలీ లిపి రూపొందించి అంధుల ఆరాధ్యుడిగా నిలిచారని కొనియాడారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దివ్యాంగుల హక్కుల వేదిక అధ్యక్షుడు నాగేశ్వరరావు, బాల్‌రాజ్‌గౌడ్, ఎస్.ప్రకాశ్ పాల్గొన్నారు.

మాస్టర్స్ డిగ్రీ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్‌కు..

ఉస్మానియా యూనివర్సిటీ : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని మాస్టర్స్ డిగ్రీ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ (ఎండీహెచ్ఎం) కోర్సు పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును ఈ నెల 9వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.300 అపరాధ రుసుముతో 16వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania. ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

ఎంఏ లాంగ్వేజెస్ పరీక్షా ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంఏ లాంగ్వేజెస్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania. ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

విద్యార్థులకు సూపర్ స్కాలర్ షిప్

చిక్కడపల్లి, జనవరి4 : జఠాధార ఎడ్యుకేషనల్ టెక్నాలజీ సంస్థ 10వ తరగతి విద్యార్థులకు సూపర్ 100 స్కాలర్ షిప్ అందించనున్నట్లు ఆ సంస్థ కోఆర్డినేటర్ అరుణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 16న ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్‌లో అర్హత సాధించిన వారికి 13-4-2025 లిఖిత పరీక్ష నిర్వస్తారని తెలిపారు. ఎంపికైన 100 మంది విద్యార్థులకు ఐఐటీ, జేఈఈ ఆన్‌లైన్ కోచింగ్, ఇంటర్ పూర్తయ్యే వరకు ప్రతి నెల రూ. 500 అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ రుసుము రూ. 200, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రూ.100 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు www. jetcs.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. ఇతర వివరాల కోసం 7337285228 సంప్రదించాలని కోరారు.

మహాసభను జయప్రదం చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 4: బీసీ విద్యార్థి రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ పిలుపునిచ్చారు. దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో సాయంత్రం 4గంటలకు నిర్వహించనున్న మహాసభకు విద్యార్థులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. సభకు ముఖ్యఅతిథిగా రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య హాజరుకానున్నట్లు వివరించారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు రాజేశ్, సోమశేఖర్, వెంకట్, సందీప్, నరేశ్, హరీశ్, గణేశ్, రాంబాబు, లక్ష్మణ్, కళ్యాణ్ పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో సర్వే

బన్సీలాల్‌పేట్, జనవరి 4 : బన్సీలాల్‌పేట్‌లోని బండమైసమ్మ నగర్ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల కాలనీలో అర్హులైన లబ్ధిదారుల ఎంపిక కోసం శనివారం సికింద్రాబాద్ మండల డిప్యూటీ తహసీల్దార్ రంజనీయాదవ్ సర్వే నిర్వహించారు. దరఖాస్తుదారుల వద్ద ఉన్న పట్టాలు, ఆధార్, కరెంట్ బిల్లు, ఇతర ధ్రువీకరణ పత్రాలను పరిశీలించామని, వివరాలను తహసీల్దార్‌కు నివేదిక రూపంలో అందజేస్తామని ఆమె తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బండమైసమ్మ నగర్ బస్తీలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల కాలనీ నిర్మించడం జరిగిందని, అర్హులైన వారందరికీ మిగిలిన ఇండ్లను కేటాయించాలని బన్సీలాల్‌పేట్ కార్పొరేటర్ కే.హేమలత అధికారులను కోరారు.